

ఎడాపెడా కమీషన్లు..!

● ప్రతికి పనికి ఓ రేటు..! ● బేరసారాలకు నిలయం
● ఆ ఇద్దరు అధికారులే కీలకం

నంద్యాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): **కలెక్టరేట్‌లోని కొన్ని సెక్షన్లలో అవినీతి పెచ్చుమీరిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి పనికీ ఓ రేటు పెట్టి వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయా సెక్షన్లలో ఓ రేటు ఫిక్స్ చేసి దండుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బదిలీల హడావుడి నడుస్తుండటంతో వీటిని కూడా తమకు అనుకూలంగా మలుచుకున్నట్టు సమాచారం. ఈ అవినీతిలో ఓ ఇద్దరు అధికారులు కీలకంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. వీరి వ్యవహారం తలనొప్పిగా మారుతుండటంతో పై అధికారులు కూడా వీరిపై అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది.**

ఆయన రూములోనే..

జిల్లా కేంద్రంలోని ముఖ్య కార్యాలయంలో ఆ అధికారిది ప్రధాన సీటు. గతంలో నంద్యాల జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ముఖ్య అధికారిగా పని చేశాడు. అప్పట్లో ఆయన చేసిన పనులు, కూడబెట్టిన ఆస్తుల గురించి స్థానికులు కథలుగా చెప్పుకుంటారు. మళ్లీ ఇక్కడకు వస్తే తన ఆస్తుల వ్యవహారాలు దగ్గరుండి చక్కబెట్టుకోవచ్చని ఆలోచించినట్టు ఉంది. ఇటీవల జరిగిన బదిలీల సమయంలో గతంలో తాను విధులు నిర్వహించిన సీటులోనే మళ్లీ కూర్చునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశాడు. ఆయన గత వ్యవహారాలు తెలిసి నాయకులు, అధికారులు ఆ అవకాశాన్ని ఇవ్వలేదు. ఆ తర్వాత కలెక్టరేట్‌లో లెక్కలు దండిగా వచ్చే సీటును ఎలాగోలా సంపాదించగలిగాడు. ముఖ్యమైన ఫైళ్లు ఆ సీటు పరిధి దాటి వెళ్లవు గనుక తన పాత నైజాన్ని చూపటం మొదలుపెట్టాడు. డబ్బుల వ్యవహారం ఉన్న ఫైళ్లపై ప్రత్యేక దృష్టి సారిస్తూ వాటి పనులు త్వరగా పూర్తయ్యేలా శ్రద్ధ వహిస్తున్నాడు. ఈ వ్యవహారాలన్నీ తన గదిలోనే పూర్తి చేస్తున్నాడు. ఇవి ఎవరి కంట పడకుండా ఉండేందుకు తన గదిలో అమర్చిన సీసీ కెమెరాల దిశను మార్చి వేసేవాడని తెలుస్తోంది. వాటిని సిబ్బంది సక్రమంగా అమర్చడంతో ఆ తర్వాత సీసీ కెమెరాలు పని చేయకుండా చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ అధికారి గదిలో సీసీ కెమెరాలు కూడా లేవని తెలుస్తోంది. ఇక జిల్లా ముఖ్య కార్యాలయంలో ఆయా సెక్షన్లను ఆధునికీకరించే పనులు చేపట్టారు. ఈ వ్యవహారంలో సదరు అధికారి చేతివాటం చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ పనులన్నీ చక్కదిద్దేందుకు తన తాబేదారును వాడుకుంటున్నట్లు సమాచారం. సదరు అధికారి ఇచ్చిన చనువుతో తాబేదారు మిగతా సెక్షన్లలోనూ వేలు పెడుతున్నాడన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

డిప్యుటేషన్‌పై వచ్చి..

దాదాపు ఎనిమిది మంది డిప్యూటీ తహసీల్దారు స్థాయి అధికారులు డిప్యుటేషన్‌పై కలెక్టరేట్‌కు వచ్చారు. వీరిలో ఒకరు మెటర్నిటీ లీవ్‌లో ఉండగా ఐదుగురు ఇటీవల వారి సొంత స్థానాలకు వెళ్లిపోయారు. ఒక పురుష అధికారి ఇదే కార్యాలయంలోని వేరే అధికారి వద్ద విధులు నిర్వహిస్తుండగా మరో మహిళా అధికారి మాత్రం ఈ కార్యాలయంలోని ముఖ్య సెక్షన్‌లోనే పని చేస్తోంది. సదరు మహిళా అధికారి తనపై అధికారితో కుమ్మక్కై డబ్బులు దండుకుంటోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉద్యోగుల బదిలీల వ్యవహారం కూడా సదరు మహిళా అధికారే పర్యవేక్షిస్తున్నారు. ఇదే అదనుగా వసూళ్లకు తెరతీసినట్లు తెలుస్తోంది. ఉద్యోగుల స్థాయిని బట్టి బదిలీ ఆర్డర్లు ఇవ్వడానికి లెక్క తీసుకుంటోందన్న ఆరోపణలు ఉన్నాయి. తనకు లాభం లేని పని విషయాల్లో మాత్రం పూర్తి అశ్రద్ధ వహిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల సర్వే మెయింటెనెన్స్ ఎలిజిబుల్ టెస్టు రాసేందుకు జిల్లా నుంచి ముగ్గురికి అవకాశం వచ్చింది. అయితే వీరు శిక్షణ తరగతులకు హాజరయ్యేందుకు అనుమతులు ఇవ్వటంలో జాప్యం చేసింది. వీరు కార్యాలయానికి వచ్చి దగ్గరుండీ మరీ పని చేయించుకోవాల్సిన పరిస్థితి. అనుమతులు ఆలస్యం కావటంతో సదరు ఉద్యోగులు మూడు రోజుల శిక్షణ తరగతులను కోల్పోవాల్సి వచ్చింది. సర్వీసుకు సంబంధించిన విషయాలు, కారుణ్య నియామకాలకు సంబంధించిన ఫైళ్లు, ఉద్యోగుల సెలవు మంజూరు విషయంలో సదరు అధికారి తీవ్ర జాప్యం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇక మహిళా ఉద్యోగుల ప్రసూతి సెలవు విషయంలో ఫైళ్లను అనుమతులకు పంపించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారన్న ఆరోపణలు ఉన్నాయి. దీని వల్ల మహిళా ఉద్యోగులు ప్రసూతి సెలవు సమయాల జీతాలు సక్రమంగా అందక ఇబ్బంది పడిన సందర్భాలు ఉన్నాయని తెలుస్తోంది. ఇక జిల్లా వ్యాప్తంగా ఆయా ఉద్యోగులు పదోన్నతి ఫైళ్ల వ్యవహారంలోనూ తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని తెలుస్తోంది. దీంతో ఆయా ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆయన చేసిన తప్పులకు జీతాల్లేక..

వీరిద్దరు పని చేస్తున్న సెక్షన్‌లోనే గతంలో ఓ అధికారి పని చేసేవాడు. ఎన్నికలు ముగిసిన తర్వాత ఆ అధికారిని ఇదే కార్యాలయంలోని మరో సెక్షన్‌కు బదిలీ చేశారు. ప్రస్తుతం ఆయన ఆ సెక్షన్‌లో పని చేయకుండా ఓ అధికారి వద్ద సహాయకుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. గతంలో తాను చేసిన సెక్షన్‌కు మళ్లీ వచ్చేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. పైగా ఈ సెక్షన్‌లో ఇప్పటికే ముఖ్య అధికారి, మహిళా అధికారి కుమ్మక్కై డబ్బులు దండుకుంటున్న విషయం తెలియటంతో తాను మాత్రం ఆ అవకాశం ఎందుకు వదులుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. అయితే గతంలో ఆయన చేసిన తప్పిదాలకు ఇప్పటికీ కొంతమంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికలకు ముందు జిల్లా యంత్రాంగం కంప్యూటర్ ఆపరేటర్లుగా పని చేసేందుకు కొంతమందిని అవుట్ సోర్సింగ్ పద్ధతిన తీసుకుంది. అయితే వీరిలో ఎనిమిది మంది పేర్లను ఆప్కోస్‌లో చేర్చటంలో సదరు అధికారి తీవ్ర నిర్లక్ష్యం వహించాడు. తమ పేర్లను ఆప్కోస్‌లో ఎక్కించాలని అప్పట్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు వేడుకున్నా సదరు అధికారి వినిపించుకోలేదు. మార్చి 13 తర్వాత ఎన్నికల కోడ్ అమల్లోకి రావటంతో వీరి పేర్లు నమోదు చేసే అవకాశం లేకుండా పోయింది. దీంతో వీరు పనులు చేసినా ఉద్యోగులు జాబితాలో లేకపోవడంతో ఇప్పటికీ జీతాలు అందలేదు. దీంతో వారంతా లబోదిబోమంటున్నారు. విధుల్లో ఈ స్థాయిలో నిర్లక్ష్యం వహించిన అధికారి మళ్లీ అదే సీటులోనికి రావాలని ప్రయత్నించటం గమనార్హం. అయితే ఆ ముఖ్య సీటును ఎందుకు ఖాళీగా ఉంచారన్నది జిల్లా యంత్రాంగానికే తెలియాలి!



తాము తక్కువ తిన్నామా అన్నట్లు..

అధికారులు ఇలా ఉంటే.. వారి కింది స్థాయి ఉద్యోగులు, తాబేదార్లు తాము తక్కువ తిన్నామా అనుకున్నట్లుంది. వారు కూడా పనుల కోసం కార్యాలయానికి వచ్చే వారి నుంచి డబ్బులు దండుకోవటం మొదలుపెట్టారు. గన్ లైసెన్సులు, రెన్యువల్, పెట్రోలు బంకులకు సంబంధించిన వ్యవహారాల్లో ఓ ఉద్యోగి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆయా కంపెనీలకు సంబంధించిన ఫైళ్ల పనులు త్వరగా పూర్తయ్యేలా చూడటంలో కార్యాలయంలోని ఓ ఇద్దరు తాబేదార్లు ముఖ్య పాత్ర పోషిస్తున్నారని తెలుస్తోంది. ఇక ఆయా సెక్షన్లలో చాలా మంది విధులను సక్రమంగా నిర్వహించటం తెలియని ఉద్యోగులే ఉన్నారని, వారి వల్లే తమకు సంబంధించిన చాలా వ్యవహారాలు సరైన సమయంలో పూర్తి కావటం లేదని మిగిలిన ఉద్యోగులే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇలా జిల్లా ముఖ్య కార్యాలయంలోని ఆయా సెక్షన్లలో చేతివాటం ఎక్కువ అవటమే కాకుండా, పనులు కూడా సక్రమంగా జరగటం లేదు. వీరి తీరుతో జిల్లా స్థాయి అధికారులు మాట పడాల్సి వస్తోంది. ఈ సెక్షన్లలోని అధికారులు, ఉద్యోగుల తీరుతో జిల్లాకు కొత్తగా వచ్చిన ఉన్నతాధికారి తీవ్ర అసంతృప్తిగా ఉన్నారని తెలుస్తోంది. డబ్బులు దండుకునేవారిని, వారికి సహాయపడుతున్న వారిని, విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తున్న వారినందరినీ మారిస్తే గానీ జిల్లా కేంద్రంలోని ముఖ్య కార్యాలయం బాగుపడదన్న అభిప్రాయం వినిపిస్తోంది.



డయేరియా బాధితులకు పరామర్శ



డయేరియా బాధితులను పరామర్శిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

వేంపెంట గ్రామస్థులతో మాట్లాడిన కలెక్టర్

పాములపాడు, సెప్టెంబరు 3: డయేరియా బాధితులను మంగళవారం కలెక్టర్ రాజకుమారి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పరామర్శించారు. మండలంలోని వేంపెంటలో ప్రతి రోజూ రోజు కేసులు నమోదవుతున్న నేపథ్యంలో కారణాలను అడిగి తెలుసుకున్నారు. అత్యవసర చికిత్స నిమిత్తం 108 వాహనాన్ని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. బాధితులకు అందుతున్న వైద్యం తదితర అంశాలపై వైద్యులు నాగలక్ష్మి, గులాబ్జాను అడిగి తెలుసుకున్నారు. తాగు నీటిలో బ్యాక్టీరియా కారణంగా వాంతులు, విరేచనాలు అవుతున్నట్లు ప్రాథమికంగా గుర్తించామని వారు తెలిపారు. గ్రామంలో తాగు నీటి సౌకర్యం కల్పించాలని, సీసీ రోడ్లు నిర్మించాలని గ్రామస్థులు కలెక్టర్, ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామ నాయకులతో కలిసి గ్రామంలోని రోడ్లను పరిశీలించారు. గ్రామానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు. గ్రామంలో పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో దాస్, తహసీల్దార్ ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, టీడీపీ నాయకులు, లక్ష్మీకాంతరెడ్డి, ఆదిరెడ్డి, పలుచాని మహేశ్వరరెడ్డి, మధుక్రిష్ణ నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం ఎడ్లబండ్లతో రాస్తారోకో



ఎడ్లబండ్లతో రోడ్డుపై రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

బేతంచెర్ల, సెప్టెంబరు 3: మండలంలో ఆర్ఎస్ రంగాపురం బస్టాండు సమీపంలో ఉన్న ప్రజలు, రైతులు తాగునీటి కోసం నడిరోడ్డుపైన ఎడ్లబండ్లతో మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేషనల్ హైవే పనుల్లో భాగంగా తమ కాలనీకి వచ్చే తాగునీటి పైపులైన్‌ను కట్ చేశారని తెలిపారు. తమ కాలనీకి దాదాపు 3 నెలలు గడుస్తున్నా అధికారులు తాగునీరు అందించలేదని వారు ఆవేదన చెందరు. కాలనీలో 30 కుటుంబాలు, దాదాపు 100 పశువులు ఉన్నాయని, దూర ప్రాంతాలకు వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నామని తెలిపారు. గ్రామ సర్పంచ్ గుమ్మరాళ్ల రాజు, పంచాయతీ సెక్రటరీ కృష్ణమూర్తి ధర్నా దగ్గరికి చేరుకుని వారితో మాట్లాడి కాలనీకి తాగునీరు అందేలా సత్వర చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

దెబ్బతిన్న టమోటా పంట

● వేల ఎకరాల్లో నష్టం ● ఆందోళనలో రైతులు



రైతులు పడేసిన కుళ్లిన టమోటాలు

ప్యాపిలి, సెప్టెంబరు 3: గత వారం రోజులుగా ఎరతెరిపి లేకుండా కురుస్తు వర్షాలకు టమోటా పంట పూర్తిగా దెబ్బతిన్నది. వరద నీరు టమోటా పొలాల్లోకి చేరింది. ఈ ఖరీఫ్‌లో మండలంలో దాదాపు నాలుగు వేల ఎకరాలో టమోటా సాగు చేశారు. ప్యాపిలి, పెద్దపూదిళ్ల, కలచట్ల, వెంగళాంపల్లి, పోతుదొడ్డి, గుడిపాడు తదితర గ్రామాల్లో కాయ వచ్చిన టమోటా పొలాల్లోకి వర్షం నీరు చేరి జోములెక్కాయి. దీంతో టమోటా కాయలకు నల్ల మచ్చలు, తెగుళ్లు సోకి కుళ్లిపోయాయి. ఎకరాకు రూ.20 వేలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంట నీటి పాలైపోయిందని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు.

నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలి

కలెక్టర్ రాజకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 3: విద్యార్థులకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకంపై ఆమె మాట్లాడారు. సంక్షేమ హాస్టళ్లలో అన్నం మెత్తగా వండితే పిల్లలకు కడుపునొప్పి సమస్యరాదని అన్నారు. కోడిగుడ్డు, రాగిజావా లేదా ముద్ద, స్వీట్ పొంగల్ తదితర పోషక పదార్థాలను పిల్లలకు ఇష్టమైన రీతిలో తయారు చేసి పెట్టాలని సూచించారు. చేతులను శుభ్రపరిచే పద్ధతులు, మరుగుదొడ్లను ఉపయోగించే విధానాలను నేర్పించాలని, అలాగే న్యూట్రీషన్ గార్డెన్ పెంపొందించడంలో వారి సహాయ సహకారాలు అందిస్తూ విద్యార్థులు ఐక్యతను చాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖాధికారి చింతామణి, డీఈఓ సుధాకర్‌రెడ్డి, పీడ్రియాట్రిషన్, న్యూట్రిషన్ డాక్టర్లు, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, పాఠశాల యజమాన్య కమిటీ సెక్రటరీలు, వంట ఏజన్సీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

కుందూ, మద్దులేరు నదుల పరిశీలన



సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ

నంద్యాల క్రైం, సెప్టెంబరు 3 : భారీ వర్షాల నేపథ్యంలో నంద్యాల పట్టణం మీదుగా ప్రవహిస్తున్న కుందూ, మద్దులేరు నదులను మంగళవారం ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పరిశీలించారు. నీటి ఉధృతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే నంద్యాల చిన్న చెరువును కూడా పరిశీలించారు. సమీప ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్పీ వెంట స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సంతోష్, టూ టౌన్ సీఐ ఇస్మాయిల్, ట్రాఫిక్‌పోలీస్ స్టేషన్ సీఐ మల్లికార్జున గుప్త తదితరులు ఉన్నారు.

తుంగభద్రతపై దృష్టి



తుంగభద్ర డ్యాం భద్రతపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) దృష్టి సారించింది. టీబీపీ బోర్డు సూచన మేరకు క్షేత్రస్థాయిలో అధ్యయనం (స్టడీ) చేయడంతో పాటు క్రస్ట్‌గేట్ల భద్రత, డ్యాం నీటి నిల్వ, స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్.. వంటి అంశాలపై నివేదిక ఇవ్వాలని ఆ కమిటీకి మార్గదర్శకాలు నిర్దేశించారు. ఆగస్టు 10న డ్యాం 19న నంబరు క్రస్ట్‌గేట్ చైన్‌లింక్ తెగిపోయి కొట్టుకపోయిన విషయం తెలిసిందే. క్రస్ట్‌గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు సారథ్యంలో స్టాప్‌గేట్ల ఎలిమెంట్ సెగ్మెంట్లు దిగ్విజయంగా అమర్చి దాదాపు 30 టీఎంసీలు కాపాడారు. తాత్కాలికంగా ఉపశమనం లభించినా.. మిగిలిన 32 క్రస్ట్‌గేట్ల ఎంత వరకు భద్రం..? అన్న ప్రశ్నలు వెల్లువెత్తాయి. దీనిపై 'తుంగ'భద్ర'మేనా..? శీర్షికన ఆంధ్రజ్యోతి ప్రచురించింది. స్పందించిన తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు అధికారులు ఎక్స్‌పర్ట్ కమిటీ ఏర్పాటు చేయాలని ఎన్‌డీఎస్‌ఏను కోరారు. సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ ఏకే బజాజ్ నేతృత్వంలో ఆరుగురు సభ్యులు నిపుణుల కమిటీని నియమించారు. ఈ కమిటీని 15 రోజుల్లోగా అధ్యయన నివేదికను సీడబ్ల్యూసీ, టీబీపీ బోర్డుకు అందజేయాల్సి ఉంటుంది.

- అధ్యయనానికి ఆరుగురు సభ్యులతో కమిటీ
- చైర్మన్‌గా సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ ఏకే బజాజ్
- కమిటీలో ఒకరు ఆదోనివాసి
- 15 రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని స్పష్టమైన ఆదేశాలు

కర్నూలు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల జీవనాడి తుంగభద్ర జలాశయం. మూడు రాష్ట్రాల్లో సుమారు 12.5 లక్షల ఎకరాలకు సాగునీరు, కోటి మందికిపైగా ప్రజలు దాహం తీరుస్తోంది. 2024-25 నీటి సంవత్సరంలో డ్యాంకు ఆశాజనంగా వరద చేరింది. అయితే 19వ నంబరు క్రస్ట్‌గేటు కొట్టుకుపోవడం వల్ల దాదాపు 62.78 టీఎంసీలు సముద్రానికి వదలాల్సి వచ్చింది. సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకోవడం, కర్ణాటక ప్రభుత్వం కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో క్రస్ట్‌గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు నాయకత్వంలో కొట్టుకుపోయిన గేటు స్థానంలో తాత్కాలికంగా స్టాప్‌లాగ్ ఎలిమెంట్ అమర్చారు. సుమారు 30 టీఎంసీలు కడలిపాలుకాకుండా కాపాడారు. మొత్తం గేట్లను మూసివేశారు. అప్పటి నుంచి డ్యాంలోకి రోజూ 25-30వేలకు పైగా టీఎంసీల వరద వచ్చి చేరుతోంది. ఈ క్రమంలో కొట్టుకుపోయిన 19వ గేట్ సహా మిగిలిన 32 క్రస్ట్‌గేట్లు భద్రమేనా..? మళ్లీ గేట్లు ఎత్తితే ఎలాంటి ఇబ్బందులు తలెత్తుతాయి..? వంటి ప్రశ్నలు వెల్లువెత్తాయి. దీనికి ప్రధాన కారణం ఈ ప్రాజెక్టు నిర్మించి 70 ఏళ్లు కావస్తోంది. క్రస్ట్‌గేట్ల జీవిత కాలం 45 ఏళ్లేనని నిపుణుడు ఎన్.కన్నయ్యనాయుడు పదేపదే చెబుతున్నారు. పదేపదే క్రస్ట్‌గేట్లు కొట్టుకుపోతే భవిష్యత్తులో రాయలసీమ రైతులు తీవ్ర సాగునీటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల సాగు, తాగునీటి అవసరాలను దృష్ట్యా తుంగభద్రను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కమిటీ సభ్యులు వీరే

తుంగభద్ర డ్యాం క్రస్ట్‌గేట్ల భద్రతపై అధ్యయన నిపుణుల కమిటీ చైర్మన్ ఏకే బాజాజ్‌ను నియమించారు. ఈయన కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ సహా వివిధ హోదాలో సుదీర్ఘకాలంగా పని చేశారు. ఢిల్లీకి చెందిన రిటైర్డ్ మెకానికల్ ఇంజనీర్లు, ఎక్స్‌పర్ట్ హర్కేశ్ కుమార్, కర్నూలు జిల్లా ఆదోని పట్టణానికి చెందిన మెకానికల్ ఎక్స్‌పర్ట్ తారాపురం సుధాకర్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి సీడీవో విభాగం ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు.

● కమిటీ సభ్యుల్లో ఆదోనివాసి సుధాకర్

తుంగభద్ర డ్యాం క్రస్ట్‌గేట్లు భద్రతపై అధ్యయనం కోసం నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ నియమించిన సభ్యుల్లో ఒకరైన తారాపురం సుధాకర్ ఆదోనివాసి. ఈయన స్వగ్రామం పెద్దకడుబూరు మండలం తారాపురం. ఈయన ప్రాథమిక, ఉన్నత విద్యతో పాటు ఇంటర్మీడియట్ బళ్లారి జిల్లా శిరుగుంపలో పూర్తి చేశారు. దావణగేరి ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ బీటెక్ పట్టా అందుకున్నారు. తుంగభద్ర స్టీల్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ కంపెనీ, మల్టీ నేషనల్ కంపెనీల్లో మెకానికల్ ఇంజనీరుగా పని చేసి స్వచ్ఛంద పదవీవిరమణ పొందారు. ఆ తరువాత దేశంలోనే కాకుండా నేపాల్‌లో ప్రాజెక్టుల మెకానికల్ ఎక్స్‌పర్ట్‌గా పని చేశారు. నేపాల్ ప్రభుత్వ సలహాదారుడిగా కూడా పని చేశారు. స్వదేశానికి తిరిగి వచ్చిన ఆయన ప్రాజెక్టుల క్రస్ట్‌గేట్లు, మెకానికల్ డిజైన్‌పై పని చేస్తున్నారు.

ఎక్స్‌పర్ట్ కమిటీ దృష్టి సారించాల్సిన ప్రధాన అంశాలు

- తుంగభద్ర డ్యాం 19వ నంబరు క్రస్ట్‌గేట్ చైన్‌లింక్ తెగిపోవడానికి, ఆ గేటు స్పిల్‌వే గ్రూవ్ (గాడి) నుంచి పూర్తిగా కొట్టుకుపోవడానికి ఖచ్చితమైన సాంకేతిక కారణాలు నిర్ధారించాలి.
- వర్షాకాలం ప్రారంభానికి ముందు, వర్షాకాలం ప్రారంభం తరువాత తనిఖీ చేసిన సమయంలో కొట్టుకుపోయిన క్రస్ట్‌గేట్, చైన్‌లింక్ పనితీరు పరీక్షించి ధ్రువీకరించారో లేదో నిర్ధారించాలి. అలాగే స్పిల్‌వే క్రస్ట్‌గేట్ల జీవితకాలం (వయస్సు), చివరి మరమ్మతులు, తనిఖీ తేదీని అంచనా వేసి నిర్ధారించాలి.
- ఇతర డ్యాంలకు ఉన్నట్లు తుంగభద్ర డ్యాంకు స్టాప్‌లాగ్ గేట్లు లేవు. స్టాప్‌లాగ్ లేకపోవడం వల్ల జరిగే నష్టాన్ని అంచనా వేయాలి. మళ్లీ ఇలాంటి సంఘటనలు జరగకుండా క్రస్ట్‌గేట్ల బలోపేతం కోసం తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేయాలి.
- మిగిలిన 32 క్రస్ట్‌గేట్ల ప్రస్తుత పరిస్థితిని అధ్యయనం చేసి వాటి భద్రతకు తీసుకోవాల్సిన చర్యలు, ఏ లెవల్‌లో నీటిని నిల్వ చేయాలో స్పష్టమైన సూచనలు (సిఫార్సు) చేయాలి.



తుంగభద్ర జలాశయం

చిన్నమర్రివీడులో డెంగీ

నివారణ చర్యలు చేపట్టిన వైద్యశాఖ

గోనెగండ్ల, సెప్టెంబరు 3: గోనెగండ్ల మండల పరిధిలోని చిన్నమర్రివీడు గ్రామంలో 46 ఏళ్ల మహిళకు డెంగీ వ్యాధి సోకినట్లు జిల్లా మలేరియా అధికారి నూకరాజు తెలిపారు. స్థానిక వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది నివారణ చర్యలు చేపట్టారు. జిల్లా మలేరియా అధికారి నూకరాజు గ్రామాన్ని సందర్శించి రోగి ఇంటి పరిసరాలలో పిచికారి చేయించి, ఈగలు, దోమలు పెరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకున్నారు. ఎవరికైనా జ్వరం ఇతరత్రా అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా, ఈవోపీఆర్‌డీ నాగేష్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు

నేడు జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 3: జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు బుధవారం నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్‌లోని మినీ సమావేశ భవనంలో ఏడు స్థాయి సంఘ సమావేశాలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారని తెలిపారు. ఉదయం 10 గంటల నుండి 10.30 గంటల వరకు 2వ స్థాయి సంఘం, 10.30 నుండి 11.00 గంటల వరకు 3వ స్థాయి సంఘం, 11.00 గంటల నుండి 11.30 గంటల వరకు 6వ స్థాయి సంఘం, మధ్యాహ్నం 11.30 నుంచి 12.00 గంటల వరకు 4వస్థాయి సంఘం, 12.00 నుంచి 12.30 వరకు 5వ స్థాయి సంఘం, 12.30 నుంచి 1.30 వరకు 1, 7వ స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు సీఈఓ పేర్కొన్నారు.

పంట వివరాలను నమోదు చేసుకోవాలి

వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి



సాగు చేసిన పత్తి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి

గూడూరు సెప్టెంబరు 3: రైతులు సాగు చేసిన పంటల వివరాలను తప్పనిసరిగా ఈ-పంటలో నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని గుడిపాడు గ్రామంలో మండల వ్యవసాయాధికారి శ్రీవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి కర్నూలు సబ్ డివిజన్ ఇన్‌చార్జి ఏడీఏ దస్తగిరిరెడ్డి గ్రామంలో రైతులు సాగు చేసిన పంట పొలాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా జేడీ వరలక్ష్మి మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంట వివరాలు తప్పనిసరిగా ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. అలాగే వీఏఏ గిరి మోహన్ రెడ్డిని పంట నమోదు, రైతుల ఈకేవైసీని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం గూడూరు పట్టణంలోని అగ్రి ల్యాబ్‌ను సందర్శించి అందులో పరీక్ష వివరాలను, వాటి ఫలితాలను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో అగ్రి ల్యాబ్ ఏవో విజయకుమార్, ఏఈవోలు లక్ష్మీనారాయణ, శ్రీవాణి, వేణుగోపాల్, రాణి తదితరులు ఉన్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు

- రూ.4.48 లక్షలు స్వాధీనం
- బైక్, కటింగ్ బ్లేడ్లు, స్పానర్లు స్వాధీనం



దొంగతనం వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ

డోన్(రూరల్), సెప్టెంబరు 3: పట్టణ సమీపంలోని రుద్రాక్షగుట్ట ప్రధాన రోడ్డులో డోన్ పోలీసులు ఇద్దరు దొంగలను అరెస్టు చేశారు. మంగళవారం సాయంత్రం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఇంతియాజ్‌బాషా, పట్టణ ఎస్‌ఐ శరత్ కుమార్ రెడ్డిలతో కలిసి డీఎస్పీ పి. శ్రీనివాసులు విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. కర్నూలు ఉమ్మడి జిల్లాలో పలు ప్రాంతాల్లో కోడుమూరు చెందిన ఉప్పరి శేఖర్, మేకల గిడ్డయ్య రైతుల పంట పొలాల్లో ట్రాన్స్‌కో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి వాటిలోని రాగితీగలను దొంగలించేవారని అన్నారు. వీరిపై గతంలో 45 కేసులు నమోదై ఉన్నాయని తెలిపారు. వీరిని అరెస్టు చేసి, రూ.4,48,500 నగదును 150 కిలోల రాగితీగలను, మోటారు బైక్‌ను, దొంగతనాలకు ఉపయోగించే కటింగ్ బ్లేడ్లు, స్పానర్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టులో హాజరు పరుస్తున్నట్లు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు.

ఆళ్లగడ్డలో నలుగురు జూదరుల అరెస్టు

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 3: ఆళ్లగడ్డ పట్టణంలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ నగీనా మంగళవారం చెప్పారు. పట్టణంలోని చిన్నకందుకూరు రోడ్డు వద్ద ఉన్న జగత్ మిల్క్‌డైరీ సమీపంలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1.80 లక్షలు, 52 పేకముక్కలు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పెద్దాసుపత్రిలో మందులపై ప్రత్యేక దృష్టి

సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 3: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మందుల స్టాక్‌పై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ధన్వంతరి హాలులో హెడ్ నర్సులు, వార్డు ఇన్‌చార్జి హెడ్‌లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రతి రోజూ మందులకు ఎంత ఇండెంట్ పెడుతున్నారు.. రోగులకు సంబంధించిన ఇన్వెస్టిగేషన్, ఎన్టీఆర్ వైద్యసేవ కేసుల విషయాలపై సూపరింటెండెంట్ చర్చించారు. ఎన్టీఆర్ వైద్యసేవ కింద సరఫరా అవుతున్న కిట్లపై ఆయన ఆరా తీశారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలకు సంబంధించి డ్రగ్స్ స్టోర్ రిజిస్టర్‌ను రెగ్యులర్‌గా మెయింటెన్ చేయాలని వార్డు ఇన్‌చార్జి హెడ్‌లను ఆదేశించారు. ఆసుపత్రిలో అన్ని విభాగా లకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్‌పై త్వరలో తనిఖీ చేస్తామన్నారు. సమీక్షలో సీఎస్ఆర్ఎంవో డా.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డా.బి.హేమనళిని, ఏఆర్ఎంవో డా.వెంకటరమణ, స్టోర్ మెడికల్ ఆఫీసర్ శారద, నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్‌పీ సావిత్రీబాయి, ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ చిరంజీవి పాల్గొన్నారు.

నాగసాయి ఆశ్రమాన్ని సందర్శించిన శ్రీశైలం పీఠాధిపతి



ఆశీర్వచనం చేస్తున్న శ్రీశైలం పీఠాధిపతి

పాములపాడు, సెప్టెంబరు 3: మండలంలోని జూటూరు గ్రామ శివార్లలోని శ్రీ నాగసాయి విద్య బ్రహ్మ ఆశ్రయాన్ని శ్రీశైలం పీఠాధిపతి డాక్టర్ చెన్నసిద్ధ పండితారాధ్య శివాచార్య మహాస్వామి సందర్శించారు. ఆశ్రమ పీఠాధిపతి శ్రీ రామనందాస్వామి వారు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు.

యువకుడి ఆత్మహత్య

కర్నూలు, సెప్టెంబరు 3: మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవనగర్‌లో వెంకటేశ్ (23) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతపురం జిల్లా యాడికి మండలం రాయలచెరువు గ్రామానికి చెందిన వెంకటేశ్ ఏడాది కింద కర్నూలు వచ్చి దేవనగర్‌లో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని నివాసముంటున్నాడు. ఆర్ఆర్‌బీ పరీక్షలకు సిద్ధమవుతూ.. వాహనాలకు జీపీఎస్ సిస్టమ్ అమర్చే పని చేస్తున్నాడు. ఈ నెల 1వ తేదీ తల్లిదండ్రులతో మాట్లాడిన వెంకటేశ్ 2వ తేదీ నుంచి ఫోన్ లిఫ్టు చేయడం లేదు. దీంతో తల్లిదండ్రులు కర్నూలులోని బంధువులకు సమాచారం ఇవ్వగా.. వారు వెంకటేశ్ గదికి వెళ్లి పరిశీలించారు. గదిలో వెంకటేష్ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే తలుపులు పగులకొట్టి వెంకటేశ్‌ను కిందకు దించి ఆసుపత్రికి తరలించాడు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మురళీధర్ రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి

శరీరమంతా ఛిద్రం

కర్నూలు, సెప్టెంబరు 3: నగరంలోని డోన్ రహదారిలో ఉన్న శ్రీచక్ర హాస్పిటల్ సమీపంలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. సోమవారం అర్ధరాత్రి తర్వాత ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు తెలిపారు. ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. జాతీయ రహదారిపై ఎలాంటి ఆనవాళ్లు కనిపించకుండా శరీరం ఛిద్రమైపోయింది. చీర, లంగా మాత్రమే రోడ్డుపై పడి ఉంది. దొరికిన దుస్తుల ఆధారంగా యాచకురాలై ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం సమీపంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

సంజామల, సెప్టెంబరు 3: పేరుసోమల, రెడ్డిపల్లె మార్గమధ్యంలో మంగళవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మృతుడు పేరుసోమల గ్రామానికి చెందిన గుల్లకుంట్ల బాల ఓబన్న ఉరఫ్ నరేష్ (35)గా గుర్తించారు. బాల ఓబన్న గ్రామంలోని పెట్రోల్ బంకులో పంపు బాయ్‌గా పనిచేసేవాడు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు పని ఉందంటూ భార్యకు చెప్పి స్కూటీపై నరేష్ బయటికి వెళ్లాడు. తిరిగి పొద్దున వరకు కనపడలేదు. రెడ్డిపల్లె గ్రామానికి చెందిన లక్ష్మీరెడ్డి అనే రైతు నరేష్ మృతదేహాన్ని చూసి పేరుసోమల గ్రామంలోని నరేష్ బంధువులకు సమాచారం అందించారు. వారు మృతుడి భార్యకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి వెళ్లారు. నరేష్ స్కూటీపై నుండి కింద పడి మృతి చెంది కనిపించాడు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య క్రిష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ రమణయ్య తెలిపారు.

ఉపాధి అవకాశాలను వినియోగించుకోండి

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 3: నిరుద్యోగులు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. మంగళవారం నగరంలోని బిర్లా కాంపౌండ్‌లోని ఎస్‌ఏసీ శిక్షణా కేంద్రంలో జరిగిన జాబ్ మేళాకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాలకు ఆకర్షితులైన ప్రముఖ కంపెనీలు తరలి వచ్చి ఇంటర్వ్యూలు నిర్వహించడం హర్షించదగిన్న విషయమన్నారు. ఆలూరు, పాణ్యం నియోజకవర్గంలో నిర్వహించిన జాబ్ మేళాకు 647 మంది నిరుద్యోగ యువతీ, యువకులు తరలిరావడం అందులో 244 మంది ఎంపిక కావడం మంచి పరిణామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్ సలీం బాషా, ఉపాధి కల్పనాధికారి దీప్తి, ఎస్‌ఏసీ డైరెక్టర్ సంతోష్, సాయితేజ, ప్రిన్సిపాల్ రమాదేవీ, శిక్షణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


చిరుత దాడిలో మేక మృతి

కోసిగి, సెప్టెంబరు 3: చిరుత దాడిలో మేక మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో జరిగింది. గ్రామంలోని మేకల మందపై చిరుత పులి మంగళవారం తెల్లవారు జామున దాడి చేసింది. కుక్కలు గట్టిగా అరుస్తూ వెంట పడటంతో ఆ మేకను అక్కడే వదిలేసి వెళ్లింది. అప్పటికే మేక మృతి చెందినట్లు రైతు హనుమంతు తెలిపారు. చిరుత పులిల వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని, ఫారెస్టు అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని హనుమంతు కోరారు.

యూరియా నీటిని తాపడంతో కాడెద్దుల మృతి

మిడుతూరు, సెప్టెంబరు 3 : యూరియా, డీఏపీ ఎరువులు కలిసిన నీటిని తాగి కాడెద్దులు మృతి చెందాయి. కడుమూరు గ్రామానికి చెందిన రామచంద్రుడు మంగళవారం తన ఎద్దుల పాకలో పొగాకు నారుమళ్ల కోసం యూరియా డీఏపీ ఎరువులను నీటిలో కలిపి ఉంచాడు. పొరపాటున ఎరువులు కలిపిన నీటిని దాన కలిపిన నీరు అనుకుని తన రెండు ఎద్దులకు తాపాడు. కొద్ది సేపటికి ఎద్దులు కొట్టు మిట్టాడుతుండం గమనించిన రైతు వెంటనే పశువైద్య అధికారి చంద్రమోహన్‌కు తెలిపాడు. డాక్టరు వెంటనే స్పందించి సంచార వాహనం ద్వారా సంఘటనా స్థలానికి చేరుకుని ఎద్దులకు వైద్యం అందించినా ఫలితం లేకపోయింది. లక్ష రూపాయల విలువగల కాడెద్దులు మృతి చెందడంతో రైతు కుటుంబ సభ్యులు రోదించారు.

వెయిట్ లిఫ్టర్లకు కలెక్టర్ అభినందన



అభినందనలు తెలుపుతున్న కలెక్టర్

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 3: రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో చాంపియన్ షిప్ సాధించిన జిల్లా వెయిట్ లిఫ్టర్లను మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ పి.రంజిత్‌బాషా అభినందించారు. గత ఆగస్టు 30, సెప్టెంబరు 1న అనకాపల్లిలో నిర్వహించిన 11వ యూత్ జూనియర్, సీనియర్స్ బాలుర బాలికల చాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారు. 55 కేజీల విభాగంలో డి.జి.వీరేష్, జూనియర్‌లో సిల్వర్ మెడల్, సీనియర్లు సిల్వర్ మెడల్స్, 61 కేజీల విభాగంలో బి.వీరేష్ జూనియర్ విభాగంలో గోల్డ్ మెడల్, సీనియర్ బ్రౌంజ్, అలాగే 61 కేజీల విభాగంలో ఎస్.అబ్దుల్లా సిల్వర్, 81 కేజీల విభాగంలో అబ్దుల్ హక్ బ్రౌంజ్, 89 కేజీల విభాగంలో నరసింహ నాయక్ జూనియర్, సీనియర్‌లలో బ్రౌంజ్, 109 కేజీల విభాగంలో ఎస్.ముష్రాఫ్ పర్వేజ్ జూనియర్ సిల్వర్ సీనియర్లు బ్రౌన్జ్ మెడల్స్ సాధించారు. అలాగే 109 కేజీల విభాగంలో బి. వెంకట్రాముడు మెడల్ సాధించారు.

నిందితుడికి రిమాండు

పోక్సోయాక్ట్ కింద కేసు నమోదు

అవుకు, సెప్టెంబరు 3 : అవుకు మండలంలో బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన వైసీపీ కార్యకర్త మోపూరి ప్రభుదాసుపై పోక్సో కింద కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ రాజారెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అవుకు మండలంలోని గ్రామానికి చెందిన ప్రభుదాసు ఈనెల 1వతేదీన ఓ బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. నిందితుడ్ని అరెస్టు చేసి ఆళ్లగడ్డ సబ్‌జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

కూలిన మట్టి మిద్దె

నందికొట్కూరు, సెప్టెంబరు 3: ఎడతెగని వర్షాలకు నందికొట్కూరు పట్టణంలో మంగళవారం ఓ మట్టి మిద్దె కూలింది. మొక్కజొన్నల వ్యాపారంలో ఏజెంటుగా పని చేస్తున్న కె మురళి పట్టణంలోని 10వ వార్డు రవీంద్రభారతి స్కూల్ సమీపంలో మట్టి మిద్దెలో నివసిస్తున్నాడు. వానలకు తడిసి మిద్దె కూలడంతో రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని మురళి తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

బండిఆత్మకూరు, సెప్టెంబరు 3: మండలంలోని జీసీ పాలేనికి చెందిన రామలక్ష్మి (32) విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపారు. రామలక్ష్మి మంగళవారం ఉదయం ఇంట్లో వంట చేసుకుని, ఇద్దరు పిల్లలను బడికి పంపించింది. అనంతరం ఇంటి గోడ పక్కన ఉంచిన మంచాన్ని ఆనుకుని కాఫీ తాగుతుండగా అక్కడే ఉన్న కరెంట్ తీగ తగిలి గిలగిల కొట్టుకుంటూ ఉండగా ఎదురింటి ఆదిలక్ష్మి వచ్చి లాగబోయింది. ఆమె కూడా విద్యుత్ షాక్‌కు లోనవ్వటంతో రామలక్ష్మి భర్త స్వాములు కర్ర సహాయంతో విద్యుత్ తీగను తొలగించాడు. అప్పటికే రామలక్ష్మి మృతి చెందింది. ఆదిలక్ష్మికి ప్రమాదం తప్పింది. స్వాములు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అగ్ని ప్రమాదానికి 85 గొర్రెలు మృతి

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 3: ఆళ్లగడ్డ పట్టణంలోని బృందావన్ కాలనీ సమీపంలో సోమవారం రాత్రి పొద్దుపోయాక జరిగిన అగ్నిప్రమాదానికి 85 గొర్రెలు మృతి చెందాయి. దీంతో యజమాని క్రిష్ణయ్యకు సుమారు రూ.10 లక్షలు నష్టం వాటిల్లింది. గుడిసెలో ఉన్న గొర్రెలను దోమలు కుట్టకుండా వేసిన పొగ వల్ల గుడిసె అంటుకొని ఈ ప్రమాదం జరిగింది. సంఘటనా స్థలాన్ని ఆళ్లగడ్డ తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి, పశువైద్యాధికారి వరప్రసాద్, లైఫ్‌టాక్స్ అసిస్టెంటు సద్దాం హుసేన్ మంగళవారం సందర్శించి మృతి చెందిన గొర్రెలను పరిశీలించారు.

ఉర్దూ వర్సిటీలో వెబ్ కౌన్సెలింగ్‌కు దరఖాస్తులు

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 3: డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి వెబ్ కౌన్సెలింగ్‌కు దరఖాస్తులు చేసుకోవాలని రిజిస్ట్రార్, ప్రొఫెసర్ వి. లోకనాథ్ తెలిపారు. 2024 ఏపీ ఐసెట్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు యూనివర్సిటీలో కోర్సుల ప్రవేశానికి అర్హులన్నారు. వెబ్‌సైట్‌లో ఈనెల 9 నుంచి 14 వరకు వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకోవాలని, ఆప్షన్స్‌లో ఏహెచ్‌యూయూను ఎంపిక చేసుకోవాలని, 17న సీట్ల కేటాయింపు, 17 నుంచి 21 వరకు యూనివర్సిటీ కళాశాలలో విద్యార్థులు రిపోర్టు చేయాల్సి ఉంటుందన్నారు.

ఉద్యాన పంటల నష్టం రూ.14 లక్షలు

ఉద్యానశాఖాధికారి నాగరాజు

నంద్యాల రూరల్, సెప్టెంబరు3; వర్షం కారణంగా నంద్యాల జిల్లాలో ప్రధానంగా ఐదు మండలాలలో ప్రాథమిక అంచనా మేరకు సుమారు 81 హెక్టార్లలో రూ14 లక్షలకు పైగా ఉద్యానవన పంటనష్టం జరిగిందని జిల్లా ఉద్యానశాఖాధికారి నాగరాజు తెలిపారు. ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం ఇటీవల నాలుగు రోజులనుండి ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా జరిగిన ఉద్యాన పంటల నష్టం అంచనాపై సిబ్బందిలో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1.10 లక్షల ఎకరాలలో ఉద్యాన పంటలను రైతులు సాగు చేశారన్నారు. వర్షాలకు మిడుతూరు, నందికొట్కూరు, ఆత్మకూరు, పాములపాడు, కోవెలకుంట్ల మండలాలలోని 88 మంది రైతులకు చెందిన మిరప 28.05, ఉల్లి 35, మునగ 0.5, టమోటా 2, తమలపాకుల తోటలు 10, కాకర 5 హెక్టార్లలో పంటలు నష్టపోయినట్లు గుర్తించామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పూర్తి స్థాయిలో నష్టపోయిన రైతులకు సాయం అందేందుకు కృషి చేస్తామన్నారు.

వరదల్లో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

ఆత్మకూరు, సెప్టెంబరు 3: ఆత్మకూరు ప్రాంతంలో ఇటీవల సంభవించిన వరదలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఆత్మకూరు రైతు సంఘం అధ్యక్షులు టపాల్ అష్రఫ్ అలి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆ సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి డిప్యూటీ తహసీల్దార్ హరికృష్ణకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆత్మకూరు మండలంలోని అన్ని గ్రామాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేలు నష్టం పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు వీరన్న, శ్రీనివాసులు, నాగన్న, రఫీక్, నరసింహుడు, బాలన్న తదితరులు ఉన్నారు.

తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టండి


పెద్దదేవళాపురం వద్ద నీట మునిగిన వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

బండిఆత్మకూరు, సెప్టెంబరు 3: వర్షాలకు తెగుళ్లబారినపడ్డ వరి పొలాలను కాపాడుకోడానికి తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి సూచించారు. మంగళవారం మండలంలోని పెద్దదేవళాపురం, లింగాపురం, ఏ కోడూరు, పార్నపల్లె గ్రామాల్లో ఆర్ఏఆర్ఎస్ ఏడీఏ జాన్సన్, ప్రధాన శాస్త్రవేత్త రవికుమార్, ఏడీఏ రాజశేఖర్, శాస్త్రవేత్త బాలాజీనాయక్, శివరామకృష్ణ దెబ్బతిన్న వరినాట్లు పరిశీలించారు. యూరియా, మ్యూరేట్‌ఆఫ్ పొటాష్‌లు పైపాటుగా వేయాలని రైతులకు సూచించారు. ఏవో స్వాతి, ఏఈవోలు పాల్గొన్నారు.

ఇందిరానగర్‌లో పారిశుధ్య పనులు

పాణ్యం, సెప్టెంబరు 3 : స్థానిక ఇందిరానగర్‌లో మంగళవారం పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టారు. కాలనీలో కంపచెట్లు తొలగించి, కాల్వల్లో పూడిక తీయించామని పంచాయతీ కార్యదర్శి ఆనందరావు తెలిపారు. అనంతరం కాలనీలో బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఖాదర్‌బాషా, మహబూబ్‌బాషా, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ బియ్యం నిల్వలు లేవు: డీసీఎస్‌వో


రైతులతో మాట్లాడుతున్న డీసీఎస్ఓ వెంకటరాముడు

పాణ్యం, సెప్టెంబరు 3 : మండలంలోని రసూళ్లపేటలోని పాఠశాలలో అక్రమ బియ్యం నిల్వలు లేవని జిల్లా పౌరసరఫరా అధికారి వెంకటరాముడు తెలిపారు. మంగళవారం కొందరు స్థానికులు కలెక్టర్‌కు అక్రమ బియ్యం ఉన్నట్లు సమాచారం ఇచ్చారు. జిల్లా వ్యవసాయాధికారి ఆదేశాల మేరకు మండల వ్యవసాయాధికారి జయప్రకాష్‌రెడ్డి పరిశీలించామని, రసూళ్లపేటకు చెందిన కొంత మంది రైతులు భారీ వర్షాల కారణంగా పాఠశాలలో ఎరువులను నిల్వ ఉంచుకున్నట్లు టీడీపీ నాయకులు శివశంకరెడ్డి, రైతులు అధికారులకు తెలిపారు. ఈ పాఠశాల భవనం గత ఏడేళ్ల నుంచి నిరుపయోగంగా ఉండడంతో రైతులు, గ్రామ ప్రజలు పాఠశాలను శుభ్రం చేసుకొని ఉపయోగించుకుంటున్నట్లు ఎంఈవో సుబ్రహ్మణ్యం తెలిపారు. ఇందుకు విద్యాశాఖ అనుమతులు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ ప్రసాదరావు, వీఆర్వో రాముడు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుడికి గుండెపోటు

ఆత్మకూరు, సెప్టెంబరు 3: ఆత్మకూరు మున్సిపాలిటీలో వాటర్ మెన్‌గా విధులు నిర్వహిస్తున్న మురహరి ప్రసాద్‌కు సోమవారం అర్ధరాత్రి గుండెపోటు వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు ఆయనను ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు రూ.40వేల విలువ చేసే గుండెపోటుకు సంబంధించిన ఇంజెక్షన్‌ను ఉచితంగా వేసి ప్రథమ చికిత్స నిర్వహించారు. సమాచారం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా, కోఆప్షన్ సభ్యులు ఎంఏ. రషీద్ వెంటనే ఆసుపత్రికి చేరుకుని అయన్ని పరామర్శించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలించారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్



మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజినాయక్

ఆత్మకూరు, సెప్టెంబరు 3: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు డీఎస్పీ ఆర్.రామాంజినాయక్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. యువత ఆన్‌లైన్ గేమ్స్ జోలికి వెళ్లవద్దని సూచించారు. అలాగే అనుమానాస్పద రెఫరల్ లింక్‌లను ఓపెన్ చేయవద్దని చెప్పారు. టెలిగ్రామ్, వాట్సాప్ తదితర సోషల్ మీడియా గ్రూపుల్లో జాయిన్ చేసి మాయమాటలతో ఇబ్బందులకు గురిచేసే ప్రమాదం ఉందని అలాంటి గ్రూపులతో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఎవరైనా తెలియని వ్యక్తులు ఫోన్ చేసి పాస్‌వర్డ్, ఇతర సమాచారాన్ని కోరినట్లయితే చెప్పకూడదని వివరించారు. కాగా ఏదైనా సందర్భంగా సైబర్ నేరాలకు గురైతే బాధితులు డయల్ 1930 నంబర్‌ను సంప్రదించాలని వివరించారు.

ఇన్‌చార్జి ఏఎస్‌డబ్ల్యూవోగా అంకన్న

ఆత్మకూరు, సెప్టెంబరు 3: ఆత్మకూరు తాలుకా ఇన్‌చార్జ్ ఏఎస్‌డబ్ల్యూఓగా బిట్టు అంకన్న నియమిస్తూ జిల్లా సాంఘీక సంక్షేమ శాఖా సాధికారత అధికారి చింతామణి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ ఏఎస్‌డబ్ల్యూఓగా పనిచేస్తున్న సుబ్బారెడ్డి సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో వెంకటాపురం హెచ్‌డబ్ల్యూవోగా పనిచేస్తున్న బిట్టు అంకన్నకు ఇన్‌చార్జి ఏఎస్‌డబ్ల్యూవో అదనపు బాధ్యతలు అప్పగించారు.

విజయవాడ వరద బాధితులకు చేయూత

ఆత్మకూరు, సెప్టెంబరు 3: విజయవాడలో సంభవించిన వరదలతో నష్ట


వరద బాధితులకు ఆహార పదార్థాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

పోయిన బాధితులకు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి తనవంతుగా చేయూతనిచ్చారు. వరద బాధితులను ఆదుకోవాలని సీఎం చంద్రబాబు ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం శ్రీశైలం ఎమ్మెల్యే పది వేల మందికి అవసరమైన ఆహార పదార్థాలను, వాటర్ బాటిళ్లను సిద్ధం చేశారు. వీటిని తన ప్రతినిధుల ద్వారా విజయవాడలోని గొల్లపూడి, భవానీపురం ఏరియాల్లో పంపిణీ చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విజయవాడలో సంభవించిన వరదలతో సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సామాజిక స్పృహతో ఎవరికి వారు తమకు తోచినంతగా వరద బాధితులకు చేయూతనివ్వాలని కోరారు. కాగా వరదల నుంచి విజయవాడ వాసులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.


ఆత్మకూరులో వరదలతో నేలవాలిన మొక్కజొన్న పంట


పంట పొలాల్లోకి చేరిన భవనాశి వ్యర్థాలు



పొలాల్లోకి వ్యర్థాలు

● తొలగించాలని కోరుతున్న బాధిత రైతులు

ఆత్మకూరు, సెప్టెంబరు 3: ఆత్మకూరు పట్టణ శివార్లలోని భవనాశి నదీ పరిసర పొలాల్లో వ్యర్థాలు వచ్చిచేరాయి. పంటంతా దెబ్బతినడంతో పాటు ప్లాస్టిక్ కవర్లు, చెత్తాచెదారం పొలాల్లో పేరుకుపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఆత్మకూరు ప్రాంతంలో భారీవర్షాలు కురిశాయి. దీంతో పట్టణంలోని లోతట్టు కాలనీలన్నీ జలమయం కావడంతో పాటు పట్టణ శివార్లలోని భవనాశి నది, పడేవాగు ఉప్పొంగి ప్రవహించాయి. అయితే ఆత్మకూరు పట్టణంలో మున్సిపాలిటీకి సరైన డంపింగ్ యార్డు లేకపోవడంతో పట్టణంలో సేకరించిన చెత్తాచెదారాన్ని ఎక్కడబడితే అక్కడ వాగులు, వంకల్లో వేస్తూ.. వచ్చారు. వర్షాలతో భవనాశి నది ఉప్పొంగి చెత్తచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు పంటపొలాల్లోకి చేరాయి. మున్సిపల్ అధికారుల అనాలోచిత నిర్ణయాల వల్ల తమ పంటలకు ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు మండిపడుతున్నారు. పంటలో చేరిన వ్యర్థాలను తొలగించడం కష్టతరంగా మారిందని, మున్సిపల్ అధికారులు తమ గోడును పట్టించుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఎకరాకు రూ.30 వేల పరిహారం చెల్లించాలి


నందికొట్కూరు మండల ఏఈవో పార్వతమ్మకు వినతి పత్రం అందజేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

నందికొట్కూరు రూరల్, సెప్టెంబరు 3: వర్షాలకు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 30 వేల నష్టపరిహారం అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు పిక్కిలి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నందికొట్కూరు మండల వ్యవసాయ కార్యాలయం వద్ద వ్యవసాయ అధికారి ఏఈవో పార్వతమ్మకు, నందికొట్కూరు తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు నందికొట్కూరు మండలం, జూపాడుబంగ్లా, మిడుతూరు, పగిడ్యాల మండలాల లోని వివిధ గ్రామాలలో పంట పొలాలు నీటమునిగి దెబ్బతిన్నాయన్నారు. మొక్కజొన్న, కంది, మినుము, సోయాబీన్, వేరుశనగ, ఉల్లి, మిరప, కొర్ర, ముఖ్యంగా పచ్చిమిర్చి పంటల్లోకి వర్షపునీరు చేరి పూర్తిగా దెబ్బతిన్నాయని అన్నారు. నష్టపరిహారం అంచనాలు తయారు చేసి, నష్టపోయిన రైతులను గుర్తించి వారికి పరిహారం త్వరితగతిన అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో భాస్కర్‌గౌడు, రామక్రిష్ణ, శివనన్న, సోమన్న, సిద్ధు, క్రిష్ణ, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి


మాట్లాడుతున్న సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి

పాణ్యం, సెప్టెంబరు 3 : గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక సీఐ కార్యాలయంలో గణేశ్ కమిటీలు, గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. నిమజ్జనం కార్యక్రమంలో ఎలాంటి గొడవలు జరగకుండా నిర్వాహకులు బాధ్యత వహించాలన్నారు. విద్యుత్, పారిశుధ్యం, మైకులు, తదితర నిర్వాహణ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఉత్సవాలలో మద్యం, టాసాసులు ఉపయోగిస్తే కఠిన చర్యలు చేపడతామన్నారు. గణేశ్ కమిటీలు తప్పనిసరిగా పోలీసు అనుమతులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉత్సవాల ఏర్పాట్లపై సమావేశం

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 3: వినాయక చవితి ఉత్సవాల ఏర్పాట్లపై బుధవారం గణేశ్ ఉత్సవాల కమిటీ సభ్యులతో కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో గణేశ్ నిమజ్జన ఏర్పాట్లపై సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో మల్లికార్జున్‌రెడ్డి మంగళవారం తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు 11న స్థానిక చిన్న చెరువు కట్టవద్ద ఉన్న వినాయక ఘాట్‌లో గణేష్ నిమజ్జన ఏర్పాట్లకు సంబంధించి గణేష్ మహోత్సవ కేంద్ర సమితి కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న గణేష్ ఉత్సవ కేంద్రసమితి కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొని సలహాలు, సూచనలు ఇచ్చి సహకరించాలని ఆర్డీవో పేర్కొన్నారు.

మహానంది: ప్రశాంత వాతవరణంలో వినాయక చవితి ఉత్సవాలను జరుపుకోవాలని మండల తహసీల్దార్ రమాదేవి తెలిపారు. మంగళవారం మహానంది మండల గణేష్ మండపాల నిర్వహణ కమిటీ సభ్యులతో మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మంటపాల వద్ద రెవెన్యూ సిబ్బందితో పాటు సచివాలయం, పోలీస్, విద్యుత్ సిబ్బంది సహకారం అవసరమని ఆమె దృష్టికి తెచ్చారు. కేవలం మూడు రోజుల పాటు వినాయక మంటపాల వద్ద పూజలకు అనుమతిస్తామని చెప్పారు. నిమజ్జనం జరిపే వినాయక ఘాట్‌ల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులకు కమిటీ సభ్యులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మండల ట్రాన్స్‌కో ఏఈ ప్రభాకర్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రామ్మోహన్‌తో పాటు కమిటీ అధ్యక్షుడు కంచెర్ల శివ, ప్రధాన కార్యదర్శి భూమా సుబ్బరామయ్య, మండల నాయకులు నరాల మౌళీశ్వరరెడ్డి, మహేశ్వరరెడ్డి, నాగపుల్లయ్య, వెంకటేశ్వర్లు, మారెడ్డి సుబ్రహ్మణ్యం, నాగరాజు క్రాంతికుమార్ పాల్గొన్నారు.

గడివేముల: గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి గణేష్ ఉత్సవ నిర్వాహకులను ఆదేశించారు. ఉత్సవాల నిర్వహణ కమిటీతో గడివేముల పోలీసు స్టేషన్‌లో మంగళవారం సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ మండపాల వద్ద భారీ శబ్దాలు వచ్చే డీజే పెట్టవద్దని అన్నారు. మూడు రోజులకు నిమజ్జనం చేయాలని అన్నారు. కార్యక్రమంలో గడివేముల ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి, గణేష్ ఉత్సవాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో కానిస్టేబుల్‌కు బంగారు పతకం



విజేత షేక్ ఫర్హాతుల్లాను అభినందిస్తున్న ఎస్పీ

నంద్యాల క్రైం, సెప్టెంబరు 3: రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో నంద్యాలలో పనిచేస్తున్న కానిస్టేబుల్ షేక్ ఫర్హాతుల్లా బంగారు పతకం సాధించారు. గత నెల 31, ఈ నెల 1వ తేదీల్లో తిరుపతిలోని సంస్కృత సెంట్రల్ యూనివర్సిటీ ఆవరణలో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో నంద్యాల త్రీ టౌన్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న షేక్ ఫర్హాతుల్లా బంగారు పతకం సాధించారు. అలాగే వచ్చే నెల 17నుంచి 20వ తేదీవరకు పాండిచ్చేరిలో జరిగే జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొననున్నారు. విజేత ఫర్హాతుల్లాను మంగళవారం ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, త్రీ టౌన్ సీఐ సూర్యమౌళి అభినందించారు. ఎస్పీ మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీల్లో కూడా పతకాలు సాధించి రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

జీవోలను విడుదల చేయాలి


మెడికల్ ఆఫీసర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

నందికొట్కూరు, సెప్టెంబరు 3: నందికొట్కూరు సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆశా వర్కర్స్‌కు విడుదల చేయాల్సిన ఒప్పంద జీవోలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్స్‌కు వేతనాలు పెంచాలని 2024 ఫిబ్రవరి 9న ప్రభుత్వం ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రతినిధి వర్గంతో జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందాల జీవోలు, సర్క్యులర్స్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. నందికొట్కూరు ఎస్‌హెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో లక్ష్మీదేవి, నాగస్వాములమ్మ, సుదారాణి, నర్సమ్మ, జమాల్, బిస్మిల్లా తదితర ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

వర్షార్పణం


దెబ్బతిన్న మినుము పంట

గడివేముల, సెప్టెంబరు 3: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చేతికందిన మినుము పంట దెబ్బతింది. మండలంలో గడిగరేవుల, పెసరవాయి, తిరుపాడు గ్రామాల్లో సుమారు 1,000 ఎకరాల్లో మినుము పంట సాగు చేశారు. పంట ఏపుగా పెరిగి కోత దశకు చేరుకుంది. ఇటీవల కురిసిన వర్షాలకు మినుము పంటలో నీరు చేరి దెబ్బతింది. కోత కోయకుండానే గింజకు మొలకలు రావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవాలని కోరారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

జిల్లా వైద్యాధికారి వెంకటరమణ


మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి వెంకటరమణ

ఆత్మకూరు రూరల్, సెప్టెంబరు 3: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి వెంకటరమణ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో బైర్లూటి వీహెచ్‌సీ వైద్యాధికారులు గోపాల్, పవన్‌కుమార్‌ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశా డే కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. వైద్యాధికారులు, ఆశాలకు పలు సూచనలు చేశారు. వేంపెంట గ్రామంలో అతిసార ప్రబలి ఒకరు మృత్యువాత పడిన సంఘటన పునరావృతం కాకుండా గ్రామాలను వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు ఎప్పటికపుడు పర్యవేక్షించాలన్నారు. ప్రస్తుత వర్షాల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఆశాలు పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సమన్వయంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, అన్ని పంచాయతీల్లో డ్రైనేజీ మురికి గుంటలు శుభ్రం చేయించడం, రహదారులపై నిలువ నీరు నిలువ ఉన్న చోట బ్లీచింగ్ చేయించడం, తాగునీటి ట్యాంకుల క్లోరినేషన్ వంటి చర్యలు చేపట్టాలన్నారు. గర్భిణులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరీక్షలు చేసి మాతృ మరణాలు సంభవించకుండా ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమణమ్మ,సీహెచ్‌వో ఖుద్దూస్ బాషా ఉన్నారు.

సుబ్రహ్మణ్య స్వామికి విశేష పూజలు


నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలం, సెప్టెంబరు 3: శ్రీశైలం మహాక్షేత్రంలో మంగళవారం లోకకళ్యాణార్థం ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య (కుమారస్వామి) స్వామికి, నందీశ్వరస్వామికి, బయలు వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి స్వామికి పూజలు జరిపారు.

● ఆకట్టుకున్న నిత్యకళారాధన

శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో మంగళవారం నెల్లూరు జిల్లాకు చెందిన మీనాక్షీ నృత్యాలయ ఆర్ట్స్ అకాడమీ బృందంచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మహాగణపతిం, నమఃశివాయతే, శివతాండవం, అయిగిరినందిని, హరహర శంకరా తదితర గీతాలకు ఆరాధ్య, శ్రీరామ్, కార్తికేయని, చైత్రప్రభ, హేమవర్షిణి, లక్ష్య, భవిష్య, గీతిక, దీపికా తదితరులు నృత్యప్రదర్శనతో అలరించారు.


7,800 ఎకరాల్లో పంట నష్టం

● మండల వ్యవసాయాధికారి మహేష్


నందికుంటలో పంట నష్టం అంచనా వేస్తున్న జిల్లా అధికారులు

కొత్తపల్లి, సెప్టెంబరు 3: కొత్తపల్లి మండలంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు 7,800 ఎకరాల్లో వివిధ రకాల పంటల నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు మండల వ్యవసాయాధికారి మహేష్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో మండలంలోని 12 గ్రామాల పంచాయతీల పరిధిలో 7,800 ఎకరాల పంట నష్టం అంచనా వేశామన్నారు. అందులో మొక్కజొన్న 7,000 ఎకరాలు, వరి 450 ఎకరాలు, మినుము 350 ఎకరాల్లో పంటలు నష్టం జరిగినట్లు అంచనా వేశామని తెలిపారు. ఈ ప్రాథమిక అంచనా నివేదికను జిల్లా అధికారులకు తెలియజేశామని వివరించారు. మరోసారి క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి ప్రభుత్వానికి తుది నివేదిక అందజేస్తామని ఏవో వివరించారు.

దెబ్బతిన్న మట్టిమిద్దెలు


గువ్వలకుంట్లలో దెబ్బతిన్న ఇళ్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఉమారాణి

కొత్తపల్లి, సెప్టెంబరు 3: మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు 22 మట్టిమిద్దెలు దెబ్బతిన్నట్లు మండల తహసీల్దార్ ఉమారాణి తెలిపారు. మంగళవారం తహసీల్దార్‌తో పాటు డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, ఆర్ఐ జహంగీర్‌బాషాతో కలిసి మండలంలోని గువ్వలకుంట్లలో వర్షాలకు దెబ్బతిన్న మట్టిమిద్దెలను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ దుద్యాల, గువ్వలకుంట్ల, కొక్కెరంచ, గోకవరం, కొత్తపల్లి, శివపురం గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు మట్టిమిద్దెలు పూర్తిగా దెబ్బతిన్నట్లు గుర్తించామన్నారు. ఈ నివేదికను కలెక్టర్‌కు పంపుతున్నట్లు తెలిపారు. ఇంకా మండలంలో ఏ గ్రామంలోనైనా మట్టిమిద్దెలు కూలిపోయినా, దెబ్బతిన్నా వెంటనే స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తెలియజేయాలన్నారు.

వెలుగోడు: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వెలుగోడు మండలంలో ఐదు మట్టి మిద్దెలు పాక్షికంగా కూలిపోయాయని తహశీల్దార్ శ్రీనివాసగౌడ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వెలుగోడులో రెండు, మోత్కూర్‌లో రెండు, బోయరేవుల గ్రామంలో ఒక్కటి పాక్షికంగా కూలిపోయినట్లు తెలిపారు మట్టి మిద్దెలలో నివాసం ఉన్నవారు వర్షాలు కురుస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఎద్దులేరుకు తగ్గిన వరద

● కొనసాగుతున్న రాకపోకలు


ఎద్దులేరు వంకపై వెళ్తున్న ప్రజలు

కొత్తపల్లి, సెప్టెంబరు 3: అటవీ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు ఉప్పొంగి ప్రవహిస్తున్న శివపురం ఎద్దులేరు వాగుకు మంగళవారం సాయంత్రానికి ఎట్టకేలకు వరద తగ్గుముఖం పట్టింది. వాగు వంతెనపై కేవలం అడుగుమేర వరద నీరు ప్రవహిస్తుండటంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు కొనసాగిస్తున్నారు.

పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిస్తాం


వడ్లరామాపురంలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏడీఏ

ఆత్మకూరు రూరల్, సెప్టెంబరు 3: ఆత్మకూరు మండలంలో గత మూడు రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలకు రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంట నష్టపోయిన రైతుల జాబితాను రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామని ఏడీఏ ఆంజనేయ, ఏవో విష్ణు వర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వారు టీడీపీ మండల అధ్యక్షుడు శివప్రసాదరెడ్డితో కలిసి మండలంలోని కురుకుంద, కొట్టాల చెరువు,వడ్లరామాపురం గ్రామాల్లో అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ నేపథ్యంలో పంటలను కాపాడుకునేందుకు రైతులు పలు జాగ్రత్తలు పాటించాలని రైతులకు సూచించారు. పంటలు పూర్తిగా నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

తగ్గుముఖం పట్టిన వర్షం


ఉద్యానవన పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మహానంది, సెప్టెంబరు 3: మహానంది మండలంలో మంగళవారం తగ్గుముఖం పట్టింది. దీంతో బుక్కాపురం వద్ద ఉన్న అలుగుతో పాటు మహానంది సమీపంలోని పాలేరువాగు వద్ద నీటి ప్రవాహం తగ్గింది. పాలేరు వాగు వంతెన పరిసరాల్లోని ప్రధాన రహదారిపై ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆర్అండ్‌బీ శాఖ అధికారులు హెచ్చరికల బోర్డును ఏర్పాటు చేశారు. నీటమునిగిన ఉద్యానవన పంటలను హార్టికల్చరల్ ఆఫీసర్ శ్రీధర్, శాస్త్రవేత్త ముత్యాల నాయిడు అరటి,పసుపు పంటలను పరిశీలించారు. నీటమునిగిన పంటలను ఏవిధంగా కాపాడుకోవాలనే అంశంపై రైతులకు అవగాహన కల్పించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

నందికొట్కూరు, సెప్టెంబరు 3: హాస్టళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని వసతి గృహ సంక్షేమ అధికారులను ఆత్మకూరు అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ లక్ష్మీదేవి ఆదేశించారు. మంగళవారం నందికొట్కూరు ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో ఆమె ఆత్మకూరు డివిజన్‌లోని బ్రాహ్మణకొట్కూరు, నందికొట్కూరు, గడివేముల, కొత్తపల్లి, బండిఆత్మకూరు, ఆత్మకూరు వసతి గృహ సంక్షేమ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. వర్షాకాలం కావడంతో కాచి చల్లార్చిన నీటిని విద్యార్థులకు ఇవ్వాలన్నారు. దోమల బెడద లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సమావేశంలో వసతి గృహ అధికారులు మహేశ్వరుడు, శ్రీనివాసులు నాయక్, షబీర్ బాష, గంగాధర్‌గౌడ్, వెంకటపతి, ఎల్లమ్మలు హాజరయ్యారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న మహిళలు

పాములపాడు, సెప్టెంబరు 3: పాములపాడులోని చౌడేశ్వరీదేవి ఆలయంలో స్థానిక ఆర్యవైశ్య మహిళలు వాసవీమాతకు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. గత 20 రోజులుగా వాసవీమాత ఉత్సవ విగ్రహానికి రోజు ఒక్కకొక్కరి ఇంట్లో పూజలు నిర్వహించి, మంగళవారం ఆర్యవైశ్యులు అంతా కలసి అమ్మవారి దేవాలయంలో సాముహిక పూజలు నిర్వహించారు. అభిషేకం, కుంకుమార్చనలు నిర్వహించారు శిగరంబొట్ల వెంకటేశ్వర్లు, పద్మావతమ్మ దంపతులు, ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

కడప జిల్లాకు 6 టీఎంసీల నీరు



తెలుగుగంగ ప్రధాన కాల్వలో ప్రవహిస్తున్న నీరు

రుద్రవరం, సెప్టెంబరు 3: తెలుగుగంగ ప్రధాన కాల్వ నుంచి 6టీఎంసీల నీరు కడప జిల్లాకు సరఫరా చేసినట్లు ఈఈ శంకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి తెలుగుంగ ప్రధాన కాల్వ ద్వారా తుండ్లవాగు రిజర్వాయరు నింపి అక్కడ నుంచి కడపజిల్లాకు సరఫరా చేశామన్నారు. ఆళ్లగడ్డ, కడప సరిహద్దులో అధికారులు ప్రతిరోజూ నీటి సరఫరా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్నారన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నీటిని అందిస్తున్నామని తెలిపారు.

కుందూలో 13,500 క్యూసెక్కుల నీటి ప్రవాహం

చాగలమర్రి: మండలంలోని రాజోలి ఆనకట్ట వద్ద 13,500 క్యూసెక్కులతో కుందూ నది ప్రవహిస్తోందని కేసీ కెనాల్ డీఈ బ్రహ్మారెడ్డి తెలిపారు. మంగళవారం ఆనకట్ట వద్ద కుందూ నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కేసీ ప్రధాన కాలువకు 700 క్యూసెక్కుల నీరు విడుదల చేశామని అన్నారు. ఎగువ నుంచి వరద నీరు ఆనకట్టకు చేరడంతో ఆనకట్ట వద్దగల 5 గేట్లను ఎత్తి కడప జిల్లా వైపుగల కుందూ నదికి విడుదల చేశామని అన్నారు. ఆయన వెంట కేసీ కెనాల్ ఏఈ జమాల్‌వలి, సూపర్‌వైజర్ దస్తగిరి ఉన్నారు.

27.8 హెక్టార్లలో పంట నష్టం అంచనా

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 3: మండలంలోని ఆయా గ్రామాల్లో 27.8 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు అంచనా వేశామని మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ మంగళవారం తెలిపారు. గత వారం రోజులుగా ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూనది ప్రవాహనికి మండలంలోని ఆయా గ్రామాల్లో వరి, పత్తి, మొక్కజొన్న, కంది పంటలు మునకకు గురై దెబ్బతిన్నాయన్నారు. మండలంలోని బోడెమ్మనూరు గ్రామంలో 9 హెక్టార్లలో, పెద్దయమ్మనూరులో 10 హెక్టార్లు, ఆర్. జంబులదిన్నెలో 8, ఇంజేడులో 0.8 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు అంచనా వేశామన్నారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, సెప్టెంబరు 3: వర్షాలు కురుస్తుండటంతో విద్యుత్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఈ షాజహాన్ మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ తడిసిన విద్యుత్ స్తంభాలు పట్టుకోవడం, తడిసిన చేతులతో స్టార్లర్లు, విద్యుత్ మోటార్లు, విద్యుత్ లైన్‌లకు తగులుకున్న చెట్లను తగలడం, గృహాల్లో ఉన్న విద్యుత్ స్విచ్‌బోర్డులను తడి చేతులతో ముట్టుకోవడం వల్ల విద్యుత్ ప్రమాదాలు జరుగుతాయని అన్నారు. విద్యుత్ లైన్ల కింద నిలబడరాదని అన్నారు. దెబ్బతిన్న విద్యుత్ తీగల గురించి తమ దృష్టికి తీసుకొని రావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

పంట నమోదు తప్పనిసరి: ఏవో

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 3: మండలంలోని గ్రామాల్లో ఖరీఫ్ లో పంటలు సాగు చేసిన రైతులు పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని కొలిమిగుండ్ల మండల వ్యవసాయాధికారి భూమా జ్యోతి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మెట్ట, ఉద్యాన వన పంటలకు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు.

కోవెలకుంట్ల: రైతులు పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి నిరంజన్ తెలిపారు. మంగళవా రం కోవెలకుంట్ల మండలంలోని కలుగొట్ల రెవెన్యూ గ్రామాల్లో రైతు సహాయక కేంద్రాలను తనిఖీ చేసి పంట నమోదును పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నమోదు కార్యక్రమం ప్రభుత్వం ఈ నెల 15 వరకు పొడిగించిందన్నారు.

అక్రమ లే అవుట్ల తొలగింపునకు చర్యలు

చాగలమర్రి, సెప్టెంబరు 3: చాగలమర్రి గ్రామంలో అక్రమ లే అవుట్ల తొలగింపునకు చర్యలు తీసుకున్నట్లు డీఎల్పీవో రాంబాబు, ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్ తెలిపారు. మంగళవారం చాగలమర్రి గ్రామంలోని టోల్‌ప్లాజా, శెట్టివీడు, కలుగొట్లపల్లె రహదారుల్లోగల లేఔట్‌లను పోలీసు బందోబస్తు మధ్య ఎక్స్‌కవేటర్‌తో అక్రమ లే అవుట్లను తొలగించామని అన్నారు. 41 అక్రమ లే అవుట్‌దారులకు నోటీసులు కూడా ఇచ్చామని, వారు ఎలాంటి అనుమతి తీసుకోకపోవడంతో మూడు లే అవుట్లను తొలగించామని అన్నారు. ఆళ్లగడ్డ రూరల్ ఎస్‌ఐ హరిప్రసాద్, ఏఎస్‌ఐ నబీ సాహెబ్, పోలీసులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలను తీర్చిదిద్దుతా: ఎమ్మెల్యే



రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 3: ఆళ్లగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే అఖిలప్రియ అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంగళవారం ఆమె తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆళ్లగడ్డలో డిగ్రీ కళాశాలను మంజూరు చేయించామని, గత ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి గొప్పలు చెప్పుకోవడం తప్ప చేసింది ఏమి లేదన్నారు. కళాశాలను జూనియర్ కళాశాలలోని రెండు పాడుపడ్డ గదులలో ప్రారంభించారని, కనీసం మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలేజీ అన్ని సమస్యలు త్వరలో పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తాను అక్రమ వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారని, నిరూపణకు మున్సిపాల్టీ కార్యాలయంలో బహిరంగ చర్చకు సిద్ధమా అని ఎమ్మెల్యే సవాల్ విసిరారు.

నూతన చట్టాలపై అవగాహన కల్పించాలి

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 3: ప్రజలకు నూతన చట్టాలపై అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే అఖిలప్రియ పోలీసు అధికారులకు సూచించారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ఆమె స్వగృహంలో దొర్నిపాడు ఎస్‌ఐ వెంకటేష్ మర్యాదపూర్వకంగా మంగళవారం ఎమ్మెల్యేను కలిశారు.

నాగశేషు మృతి పార్టీకి తీరని లోటు

చాగలమర్రి, సెప్టెంబరు 3: మండలంలోని గొడిగనూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, పాఠశాల కమిటీ అధ్యక్షుడు నాగశేషు (38) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని టీడీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, గ్రామ నాయకులు శేఖర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి అన్నారు. మృతదేహంపై పూలమాల వేసి సంతాపం ప్రకటించారు. వారి వెంట టీడీపీ నాయకులు సూర్యనారాయణ, ప్రమోద్, నరసింహుడు, రామసుబ్బయ్య, రామకృష్ణ, రవి ఉన్నారు.

మొదలైన వినాయక చవితి సందడి

» మట్టి విగ్రహాలతో పర్యావరణం కాపాడాలంటున్న ప్రభుత్వం



అమ్మకానికి సిద్ధంగా ఉన్న గణపతి ప్రతిమలు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 3: జిల్లాలో వినాయక చవితి సందడి ప్రారంభమైంది. పండుగకు ఇంకా నాలుగు రోజులు గడువు ఉన్నప్పటికీ అప్పుడే సందడి మొదలైంది. పల్లెలూ, పట్టణాలు అన్న తేడా లేకుండా బొజ్జ గణపయ్యల ప్రతిమలు పండుగకు సిద్ధంగా విభిన్న ఆకృతులలో తయారు చేసి ప్రధాన రహదారుల పక్కనే వ్యాపారులు విక్రయిస్తున్నారు. మరోవైపు గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు ఎక్కడికక్కడ ఏర్పాట్లలో నిమగ్నమవుతున్నారు. వినాయక చవితి చందాల వసూళ్లలో కొందరు బీజీగా మారగా మరికొందరు మండప నిర్మాణాలు, ప్రత్యేక డెకరేషన్, ప్రతిమల కొనుగోళ్ల తదితర పనుల్లో నిమగ్నమయ్యారు.

మట్టి విగ్రహాలతో పర్యావరణం కాపాడాలంటున్న ప్రభుత్వం: పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి గణపయ్యలనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఇప్పటికే పిలుపునిచ్చింది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసే వినాయక ప్రతిమలతో పర్యావరణానికి ముప్పు ఏర్పడుతోందని పేర్కొంటున్నారు.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి: సీఐ





చాగలమర్రిలో మాట్లాడుతున్న ఆళ్లగడ్డ రూరల్ సీఐ కంబగిరి రాముడు, బనగానపల్లెలో..

చాగలమర్రి, సెప్టెంబరు 3: గ్రామాల్లోని ప్రజలు గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆళ్లగడ్డ రూరల్ సీఐ కంబగిరి రాముడు అన్నారు. మంగళవారం సాయంత్రం చాగలమర్రి పోలీసు స్టేషన్ ఆవరణలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించే ముందు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. మూడు రోజుల పాటు ప్రతిష్ఠించి నిమజ్జనం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ రూరల్ ఎస్‌ఐ హరిప్రసాద్, ఉత్సవ కమిటీ, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, ప్రభుత్వ ఖాజీ యూనస్, ఆయా సంఘ నాయకులు పాల్గొన్నారు.

బనగానపల్లె: గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని బనగానపల్లె తహసీల్దారు నారాయణరెడ్డి, సీఐ కృష్ణ య్యయాదవ్ అన్నారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో గణేశ్ ఉత్సవాలపై ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికా రులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గణేశ్ నిమజ్జనాన్ని సమష్టి కృషితో విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గణేశ్ నిమజ్జన కమిటీ అధ్యక్షుడు మల్లారెడ్డి, టంగుటూరు శ్రీనయ్య, విద్యుత్ ఏఈ శ్రీనివాసులు, అగ్నిమాపక అధికారి నరసింహులు, ఆర్‌ఐ రాఘవేంద్ర పాల్గొన్నారు.

డోన్(రూరల్): గణేశ్ ఉత్సవాలను భక్తులు ప్రశాంతంగా జరుపుకోవాలని డోన్ డీఎస్పీ పి.శ్రీనివాసులు సూచించారు. మంగళవారం సాయంత్రం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డోన్‌లో గణేష్ ఉత్సవాలు జరుపుకునేందుకు ఐదు రోజుల అనుమతి ఇచ్చామన్నారు. వీధుల్లో గణేశ్ మండపా లను ఏర్పాటు చేసుకునే భక్తులు మూడు రోజుకు నిమజ్జనానికి సంసిద్ధమైతే వాటికి కావాల్సిన ఏర్పాట్లను పోలీసులు చేస్తారన్నారు. మండపాల వద్ద మద్యం సేవించి డీజే సౌండ్లను ఏర్పాటు చేసి అల్లర్లు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైసీపీ వల్లే గుంతల రోడ్లు: టీడీపీ



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

బనగానపల్లె, సెప్టెంబరు 3: రాష్ట్రంలోని రహదారులను గుంతల రోడ్లుగా మార్చిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదే అని టీడీపీ నాయకులు విమర్శించారు. మంగళవారం బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో టీడీపీ నాయకులు కాట్రెడ్డి మల్లి కార్జునరెడ్డి, బనగానపల్లె పట్టణ టీడీపీ అధ్యక్షుడు కాశీంబాబు, ఉపసర్పంచ్ బురానుద్దీన్, మంచాల మద్దిలేటిరెడ్డి అన్నారు. మంగళవారం విలేఖర్ల సమా వేశంలో వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సభలో రోడ్లు అధ్వానంగా ఉన్నా యంటూ రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని విమర్శించడం తగదన్నారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు బొబ్బల గోపాల్‌రెడ్డి, నియోజకవర్గం మైనార్టీ టీడీపీ అధ్యక్షుడు రాయలసీమ సలాం తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు ఆత్మహత్యపై విచారణ

కోవెలకుంట్ల, సెప్టెంబరు 3: మండలంలోని కలుగొట్ల గ్రామానికి చెందిన బుచ్చమ్మగారి రామనాయుడు అనే కౌలు రైతు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న ఘటనపై మంగళవారం తహసీల్దారు పవన్‌కుమార్ రెడ్డి, ఏవో నిరంజన్, రేవనూరు ఏఎస్‌ఐ బాలు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామనాయుడు తనకున్న అర ఎకరా పొలంతో పాటు పది ఎకరాలు కౌలుకు తీసుకుని గత ఏడాది మిరప పంట సాగు చేశారు. ఈ పంట సాగు చేయడానికి బంధువుల వద్ద అప్పులు చేశాడు. అయితే పంట దిగుబడులు సరిగా రాక రూ. 10 లక్షల దాకా అప్పులు చేశా డు. దీంతో మనస్తాపం చెంది శనివారం రాత్రి ఆత్మహత్యాయత్నం చేశాడు. విషయం తెలుసుకున్న బంధువులు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిం చారు. కోలుకోలేక ఆదివారం మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అందులో భాగంగా మంగళవారం ప్రాథమిక విచారణ చేపట్టారు.

బాలికా విద్యను ప్రోత్సహించాలి

బనగానపల్లె, సెప్టెంబరు 3: బాలికా విద్యను ప్రోత్సహించాలని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందచారి అన్నారు. మంగళవారం పలుకూరు గ్రామంలోని యూపీ ఉర్దూ పాఠశాలలో విద్యార్థులకు ఆయన నోటు పుస్తకాలు పంపిణీ చేసి, బాలికల విద్య ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రహీంబేగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిరప పంట దున్నివేత



అప్పనపల్లె సమీపంలో ట్రాక్టరుతో మిరప పంటను దున్నేస్తున్న రైతు

రుద్రవరం, సెప్టెంబరు 3: మండలంలోని పెద్దకంబలూరుకు చెందిన శ్రీను అనే రైతు అప్పనపల్లె గ్రామ సమీపంలో ఆరు ఎకరాల్లో మిరప పంట సాగు చేశారు. మంగళవారం ట్రాక్టరుతో ఆరు ఎకరాల్లో సాగు చేసిన మిరప పంటను దున్నివేశారు. పంటకు తెగుళ్లు సోకి దిగుబడి లేక, మరో వైపు గిట్టుబాటు ధర లేకపోవడంతో పంటను దున్నేసినట్లు రైతు వాపోయారు. రూ.6లక్షలు పెట్టుబడి పెట్టామని, పెట్టుబడి కూడా చేతికందని పరిస్థితి ఉందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

'నిత్యావసరాల ధరలు తగ్గించాలి'



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

డోన్(రూరల్), సెప్టెంబరు 3: పెరిగిన నిత్యావసర ధరలను తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశా రు. మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో గుత్తి రోడ్డు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రంగనాయుడు మాట్లాడుతూ అర్హులైన పేదలకు రేషన్ కార్డులను అందజేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ అనుబంధ సంఘాల నాయకులు రాధాకృష్ణ, నారాయణ, షమీమ్ బేగం పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

దొర్నిపాడు, సెప్టెంబరు 3: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి నేగల ఉసేని అన్నారు. మంగళవారం మండలంలోని డబ్బ్యా. కొత్తపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందికి, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ ఈనెల 17న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ఆశా కార్యకర్తలకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఉసేని, విస్తరణాధికారి నారాయణ, పర్యవేక్షణాధికారి భాగ్యమ్మ పాల్గొ న్నారు.

డోన్(రూరల్): సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని కొత్తబురుజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్ వైజర్ ఏ.చంద్రశేఖర్, డా.రాంభూపాల్ అన్నారు. మంగళవారం కొత్తబురుజు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మొక్కలు నాటారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటలక్ష్మమ్మ, సీనియర్ అసిస్టెంట్ శంకరమ్మ పాల్గొన్నారు.

పవిత్రోత్సవాల పూజలు

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 3: తూర్పుగోదావరి జిల్లా అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి పవిత్రోత్సవాల మాలలకు అహోబిలం లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఉంచి వేదపండితులు మంగళవారం పూజలు చేశారు. కొన్ని ఏళ్ల నుంచి రంగారావు గోష్టి సభ్యుల తరపున పవిత్రమాలను అహోబిలం లక్ష్మీనరసింహస్వామి పాదాల చెంత ఉంచి ఆ పవిత్రమాలలను అంతర్వేది అర్చకులకు అందజేస్తారు. ఈ కార్యక్రమంలో అహోబిలం ప్రధాన అర్చకులు వేణుగోపాలన్, సౌమ్యా నారాయణన్, అంతర్వేది దేవస్థానం శ్రీసుదర్శనమ్ రమేష్ స్వామి, గోష్టి సభ్యులు రవికాంత్ చౌదరి పాల్గొన్నారు.



అహోబిలంలో పవిత్రమాలలకు పూజలు చేస్తున్న వేదపండితులు

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్లు

అవుకు, సెప్టెంబరు 3: పౌష్టికాహారాన్ని తీసుకున్నపుడే ఆరోగ్యంగా ఉంటామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పావని, శివమ్మ అన్నారు. మంగళవారం పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా అవుకు పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రం-8 లో గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలకు పౌష్టికాహారంపై అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఉధృతంగా పాలేరు

» వరద ముంపులో వరి పంట

» 600 ఎకరాల్లో పంట నష్టం



కమలపురిలో నీట మునిగిన వరి పంట

సంజామల, సెప్టెంబరు 3: మండల వ్యాప్తంగా 10 గ్రామాలకు తాగు, సాగు నీరు అందించే పాలేరు వాగు గత మూడు రోజుల నుండి ఉధృతంగా ప్రవహిస్తోంది. భారీ వర్షాల కారణంగా వాగు ఉప్పొంగడంతో పరివాహక ప్రాంతంలోని వరి పంట ముంపుకు గురైంది. మండలంలోని హొత్రమాన్ దిన్నె, వసంతాపురం, బొందలదిన్నె, కమలపురి, ముదిగేడు, ముక్కమళ్ల, సంజామల, ఎగ్గొని, కొత్తపేట, ముచ్చలపురి గ్రామాన్ని వాగు పరివాహకంలో దాదాపు 600 ఎకరాల్లో వరి పంట నీట మునిగి రైతులు నష్టపోయారు. ఎకరానికి రూ.5 వేలు వెచ్చించి నాట్లు వేయించి, రెండుసార్లు ఎరువు చల్లించి ఎకరానికి రూ.20వేలు పెట్టుబడి పెట్టి రైతులు నష్టపోయారు.



కోవెలకుంట్లలో కూలిన మట్టిమిద్దె

వర్షాలకు కూలిన మట్టిమిద్దె

కోవెలకుంట్ల: గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కోవెలకుంట్ల పట్టణంలోని ఆంజనేయస్వామి వీధిలో ఉన్న అబ్దుల్‌ఖాదర్ జిలాన్ అనే వ్యక్తికి చెందిన మట్టిమిద్దె సోమవారం రాత్రి కూలిపోయింది. కుటుంబ సభ్యులు ఎవరూ ఇంట్లో లేకపోవ డంతో ప్రాణ నష్టం జరగలేదు. తన కుటుంబం ఉండడానికి ఇల్లు లేక ఇబ్బంది పడుతున్నామని బాధితుడు జిలాన్ వాపోయాడు. మంగళవారం తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందిస్తామని తహసీల్దారు తెలిపారు.

టీడీపీతోనే పేదల సంక్షేమం



డొక్కా సీతమ్మ భోజన పథకం ప్రారంభిస్తున్న అన్సర్‌బాషా

చాగలమర్రి, సెప్టెంబరు 3: రాష్ట్రంలో టీడీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా అన్నారు. మంగళవారం చాగలమర్రి బాలికోన్నత పాఠశాలలో మహీర్ పొదుపు లక్ష్మి సంఘం ద్వారా డొక్క సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు నాణ్యతగల భోజనం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయలక్ష్మి, టీడీపీ నాయకులు మాబులాల్, అజీమ్, వసీమ్, షమి, మౌళాలి, అనిఫ్, కరిముల్లా, విద్యా కమిటీ చైర్మన్లు ఉసేన్‌సా, బాలయ్య, షబ్బీర్, దస్తగిరి పాల్గొన్నారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి: కాంగ్రెస్

డోన్(రూరల్), సెప్టెంబరు 3: పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల సమీపంలో ఉన్న చెరువులు, వాగులు, వంకలు, కాలువలను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు గార్లపాటి మద్దిలేటి డిమాండ్ చేశారు. ఈ మేరకు డోన్ ఆర్డీవో మహేశ్వరరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. మద్దిలేటి మాట్లాడుతూ పట్టణ పరిసరాల్లో కొంత మంది స్వార్థపరులు రియల్ ఎస్టేట్ వ్యాపారం ముసుగులో వంకలకు ఆనుకుని వున్న ప్రభుత్వ భూములను వారి వెంచర్లలో కలిపేసుకుని కబ్జాలు చేసి వ్యాపారాలు చేస్తున్నారని అన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

బనగానపల్లె, సెప్టెంబరు 3: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వెలుగు ఏపీఎం తిరుపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ఆయన సీసీలు, పొదుపు మహిళలతో మాట్లాడుతూ అధికారులు బాగా పనిచేస్తే ప్రజలు వారిని గుర్తు పెట్టుకుంటారన్నారు.

ఎండు తెగులు నివారణకు చర్యలు

బేతంచెర్ల, సెప్టెంబరు 3: కంది పంటలో ఎండ తెగులు నివారణకు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం బేతంచెర్ల సమీపంలోని కంది పంటలకు సోకిన ఎండు తెగులును ఆయన పరిశీలించారు.

గిరిజనుల విద్యాభివృద్ధికి కృషి

చాగలమర్రి, సెప్టెంబరు 3: గిరిజనుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈవో న్యామతుల్ల అన్నారు. మంగళవారం కేపీ తాండ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజన పథకాన్ని, రికార్డులను, విద్యార్థుల గ్రేడింగ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్టు

బేతంచెర్ల, సెప్టెంబరు 3: మండలంలోని బుగ్గానిపల్లె తండా గ్రామానికి చెందిన పాండు నాయక్ అనే సారా విక్రేతను మంగళ వారం పోలీసులు అరెస్టు చేశారు. పాండు నాయక్‌గ్రామంలో నాటు సారా విక్రయాలు కొనసాగిస్తున్నాడన్న సమాచారం మేరకు పోలీ సులు దాడులు చేసి పాండునాయక్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి డోన్ కోర్టులో హాజరు పరచగా.. రిమాండ్‌కు ఆదేశిం చిందని హెడ్ కానిస్టేబుల్ సర్దార్ ఆలి తెలిపారు.

మినుము సాగులో మెలకువలు పాటించండి



కలుగొట్లలో మినుము పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కోవెలకుంట్ల, సెప్టెంబరు 3: రైతులు మినుము, బెండపంట సాగులో మెలకువలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని నంద్యాల రీజనల్ అగ్రికల్చర్ శాస్త్రవేత్తలు రాఘవేంద్ర, జయలక్ష్మి, ఈశా పేర్కొన్నారు. మంగళవారం కోవెలకుంట్ల మండల పరిధిలోని కలుగొట్ల, రేవనూరు గ్రామాల్లో రైతులు సాగు చేసిన మినుము, బెండ పంటలను ఏవో నిరంజన్‌తో కలిసి శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మినుము పంటలో బూడిద తెగులు సోకిందన్నారు. ఈ తెగులు నివారణకు తయోఫనేట్ మైథిల్ 200 గ్రాములు ఎకరాకు లేదా మైకోపుటానిల్ 200 గ్రాములు ఎకరాకు పిచికారి చేసి నివారించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి అధ్యక్షుడిగా ఫణిరాజ్



సీఐకి వినతి పత్రం అందజేస్తున్న గణేష్ మహోత్సవ సమితి నాయకులు

డోన్, సెప్టెంబరు 3: డోన్ పట్టణ గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి అధ్యక్షుడిగా కోట్రికే ఫణిరాజ్‌ను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం పట్టణ సీఐ ఇంతియాజ్ బాషాను, తహసీల్దార్ నాగమణిలను గణేష్ మహోత్సవ కేంద్ర సమితి అధ్యక్షుడు కోట్రికే ఫణిరాజ్ ఆధ్వర్యంలో సభ్యులు కలిసి గణేష్ ఉత్సవాలు, నిమజ్జనం ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం సీఐకి వినతి పత్రం అందజేశారు.

స్పీడు బ్రేకర్లు వేయించండి



పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం ఇస్తున్న బీసీ కాలనీ వాసులు

ప్యాపిలి, సెప్టెంబరు 3: రోడ్డు ప్రమాదాల నివారణ కోసం తమ కాలనీలో స్పీడు బ్రేకర్లు వేయించాలని పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన యువకులు ప్రతాప్, చంద్ర, వెంకటేష్ తదితరులు మంగళవారం పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ప్యాపిలి నుంచి పత్తికొండకు నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు వెళ్లుతుంటాయని, అలాగే టమోట మార్కెట్ కూడా ఈ ప్రాంతంలోనే ఉండటం వలన లారీలు కూడా ఎక్కువగా వస్తుంటాయని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు.